క్లుప్తంగా

అభివృద్ధిలో ఉప సర్పంచులు కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీఓ ధనలక్ష్మి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల్లో మౌళిక వసతులు కల్పించడం, విద్య, వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి చొరవ చూపాలని చెప్పారు. పంచాయతీల ఆదాయ వనరులతో గ్రామ పంచాయతీల్లో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఐదు గ్రామాల్లో పల్లెపండుగ

తవణంపల్లె: మండలంలోని తవణంపల్లె, టి.పుత్తూరు, గురుకువారిపల్లె, ఈచనేరి, కొండ్రాజుకాలువ గ్రామాల్లో గురువారం పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొంటారని వివరించారు.

పౌష్టికాహారమే శ్రీరామరక్ష



ఆహార ప్రదర్శనలో సిబ్బంది, విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పౌష్టికాహారమే తల్లీ బిడ్డకు శ్రీరామరక్ష అని అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ లోకేశ్వరి అన్నారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ప్రసూతి విభాగంలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. పలు రకాల ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, తినుబండారాలను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు తాజా ఆకుకూరగాలు, పండ్లు తీసుకోవాలన్నారు. సరైనా పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. గర్భిణులు వైద్యులు సూచనలు, సలహాలు పాటించి తీసుకునే ఆహార విషయాల్లో నిర్లక్ష్యం వద్దన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: గ్రామాలలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని తుంబకుప్పం, సదకుప్పం, నలగాంపల్లె, తంబుగానిపల్లె పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్, వివిధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్ఈ



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయాన్ని జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ బుధవారం పరిశీలించారు. తొలుత ఈఈ మునిచంద్రతో కలిసి డీఈ, ఏఏఈ, జేఏఈ, ఏఈలతో సమావేశమయ్యారు. తుపాను నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పూర్తిచేయాలని కోరారు. ఈ సమయంలో మరింత వేగంగా స్పందించాలని చెప్పారు. చిన్నపాటి విద్యుత్ ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఈఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. సబ్‌స్టేషన్ పరిశీలించి ఫీడర్ల వారీగా ఏ ప్రాంతాలకు సరఫరా ఇస్తున్నారో అడిగారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఏఈ గీత, జేఏఈ గోవిందరాజులు, ఏఈలు పాల్గొన్నారు.

ఉరుములు.. పిడుగులు



ఆకాశంలో మెరుపు రేఖలు

- వర్షాల సమయంలో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలతో ప్రమాదాలు దూరం

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల పిడుగుపాటుకు జీవులు మృతి అని వార్తలు వినేవాళ్లం. గతంలో కంటే పిడుగులపై అవగాహన పెరిగింది. కానీ మారుతున్న కాలానుగుణంగా ఏ సమయంలో వాన వస్తుందో తెలియని పరిస్థితి. ఉదయం మండు టెండ కాసీ సాయంత్రం పిడుగులతో వర్షం కురుస్తున్న పరిస్థితి. అటువంటి సమయంలో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదని పర్యావరణ శాస్త్రజ్ఞులు అంటున్నారు. పిడుగును ఇంగ్లిష్ థండర్ స్టోన్ అంటారు. మేఘాలు ఢీకొన్నప్పుడు వెలువడే కాంతిని మెరుపు అని, శబ్దాన్ని ఉరుము అంటారు. ఈ సమయంలో వెలువడే విద్యుత్‌ను పిడుగు అంటారు. ఇందులో దాదాపు 30 కోట్ల ఓల్టుల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా..

రక్షణకు..

పిడుగుపడే ముందు మెరుపు మెరుస్తుంది. తరువాత కొంత సేపటికి భారీ శబ్దంతో కూడిన ఉరుము వస్తుంది. దాన్ని మన చెవులు తట్టుకోలేవు. కొన్నిసార్లు కర్ణభేరి పగలడమో, శాశ్వత చెవుడు ఏర్పడటమో జరుగుతుంది. అటువంటి సమయంలో చెవులు మూసుకుని నోరు తెరవాలి. దీనివల్ల ఆ శబ్దం చెవి నుంచి నోటిద్వారా బయటకు ప్రసారం అవుతుంది. అందుకే పెద్దవారు పిడుగు పడే సమయంలో నోరుతెరిచే విధంగా అర్జునా..ఫల్గుణా అని అనమంటారు. సైన్స్‌నే పెద్దలు ఆ విధంగా చెప్పి ఉంటారని అర్థం చేసుకోవచ్చు.

ఇలా తెలుసుకోండి

ప్రస్తుతం ఆధునిక సాంకేతికతతో వాతావరణ శాఖ నిపుణులు అందిస్తున్న సమాచారం మేరకు ఎక్కడ పిడుగుపడే ప్రమాదం ఉందో తెలుసుకుని ప్రజలను హెచ్చరిస్తున్నారు. అలాగే ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని పంపుతున్నారు.



భవనంపై లైట్నింగ్ కండక్టర్ అమర్చుతున్న కార్మికుడు

నష్టం రాకుండా..

రాగి, ఇత్తడి లోహాలు పిడుగులను ఆకర్షిస్తాయి. పిడుగులు పడకుండా ఇళ్లపై రాగి కమ్మీలు ఏర్పాటు చేసుకుంటే ఆస్తినష్టంతో పాటు ప్రాణ నష్టం తప్పుతుంది. ఎందుకంటే పిడుగులో ఉండే ధనావేశ విద్యుత్ నేలకు అనుసంధానించిన రాగి తీగను తాకడం వల్ల తటస్థం అవుతుంది. దీన్నే లైట్నింగ్ కండక్టర్ అని లైట్నింగ్ అరెస్టర్ అని పిలుస్తారు. భవనంపై రాడ్ అమర్చి దానికి అనుసంధానం చేసిన రాగి తీగను భూమిలో పాతి పెట్టాలి. మెరుపు నుంచి వచ్చే విద్యుత్‌ను రాడ్ ఆకర్షించి, రాగి తీగద్వారా భూమిలోకి పంపుతుంది. తద్వారా పిడుగు ప్రభావం భూమిలోకి వెళ్లిపోతుంది. భవనాన్ని పిడుగుపాటు నుంచి రక్షించుకోవచ్చు. ఈ లైట్నింగ్ కండక్టర్స్ ప్రస్తుతం రూ.2 వేల నుంచి రూ.40వేల వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కనీసం రూ.20 వేలు ధర ఉన్న లైట్నింగ్ కండక్టర్ అయితే సమర్థవంతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు ఇలా

- వర్షాలు పడుతున్న సమయంలో సెల్‌ఫోన్, ఎఫ్ఎం రేడియో వాడకూడదు. భారీ వర్షం పడే సమయంలో కారులో ఉండటమే క్షేమం. వీలైతే పొడి భూమిపైకి వెళ్లాలి.
- ప్రాణాలను రక్షించుకునే అవకాశం లేనప్పుడు తలను మోకాళ్లపై ముడుచుకుని కూర్చోవాలి. దాంతో పిడుగు మనపై పడే అవకాశం తగ్గుతుంది.
- చెట్లు, టవర్ల కిందకు వెళ్లకూడదు. ఉరుముల సమయంలో బైకులు నడపకూడదు.
- అరికాళ్లను భూమిపై పెట్టకుండా వేళ్లపై కూర్చోవాలి. నీరున్న ప్రాంతం నుంచి దూరంగా వెళ్లాలి.
- ఇంట్లో విద్యుత్‌తో నడిచే ఎలక్ట్రానిక్ పరికరాలు ఆఫ్ చేయాలి. ప్లగ్‌లు తీసేసి ఉంచాలి.
- మెరుపులు, ఉరుముల సమయంలో స్నానం చేయకూడదు. అంట్లు తోమకూడదు.
- పిడుగుపాటుకు గురైన వారికి వెంటనే చికిత్స అందించాలి.



అప్రమత్తంగా ఉండండి

పూతలపట్టు: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గుర్రప్ప ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు ఇంటికే పరిమితం కావాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని చెప్పారు. వాగులు, వంకలు, చెరువులు వద్దకు ప్రజలు వెళ్లకూడదని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలు అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9491077022కు సంప్రదించాలని తెలిపారు.

ఇంటింటికీ మెరుగైన వైద్యం



నల్లపురెడ్డిపల్లెలో మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు స్థానిక వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు, మహిళలకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రిప్ విధానాన్ని ప్రోత్సహించాలి



డ్రిప్ వినియోగంపై జాయింట్ కలెక్టర్‌కు వివరిస్తున్న ఉద్యానవన అధికారులు

బంగారుపాళెం: పంటల సాగులో రైతులకు డ్రిప్ విధానాన్ని ప్రోత్సహించాలని జేసీ విద్యాధరి అధికారులను ఆదేశించారు. మండలంలోని నలగాంపల్లెలో బుధవారం సాయంత్రం సూక్ష్మ సాగునీటి పథకం కింద లబ్ధి పొందిన రైతు పొలాన్ని ఉద్యానశాఖ అధికారులతో కలసి జేసీ సందర్శించారు. డ్రిప్ విధానం ద్వారా పంటలకు నీరు అందించే విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, డ్రిప్ విధానాన్ని గురించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సన్న, చిన్న కారు రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం డ్రిప్ పరికరాలపై అందించే రాయితీలను గురించి రైతులకు వివరించాలన్నారు. డ్రిప్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుబ్రమణ్యం, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఉద్యానశాఖ అధికారి సాగరిక పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కోనగుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షాకాలంలో తగినంత వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ డాక్టర్ అయినా అనుమతి తప్పనిసరి

పలమనేరు: ఎంబీబీఎస్ చదివిన క్వాలిఫైడ్ డాక్టర్లు అయినా సరే వైద్య సేవలందించేందుకు డీఎంహెచ్ఓ అనుమతులు తప్పనిసరని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి హనుమంతరావు అన్నారు. డీఎంహెచ్ఓ నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోకుండా మెడికల్ షాపు నిర్వాహకుల వద్ద డాక్టర్లుగా సేవలందిస్తే చర్యలు తప్పవని డాక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. కొందరు క్వాలిఫైడ్ డాక్టర్లు సైతం పట్టణంలో అనధికారికంగా వైద్య సేవలందిస్తున్నారనే విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు, ఆయన బుధవారం స్థానిక ఆరోగ్యశాఖ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. మరికొందరు మెడికల్స్ షాపు నిర్వాహకులు క్వాలిఫైడ్ వైద్యులను పిలిపించుకొని వారి షాపు పక్కనే క్లినిక్‌లో రోగులకు సేవలందిస్తున్నారన్న సమాచారం ఆ ఫిర్యాదుల్లో ఉంది. చిన్నారులకు టీకాలు సైతం వేస్తామంటూ దోచేస్తున్నారనే సమాచారంతో ఆయన పట్టణంలోని ఆరోగ్య క్లినిక్‌ను తనిఖీ చేశారు. చిన్న పిల్లలకు వ్యాధి నివారణ టీకాలను ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోందని వీటి కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట డాక్టర్లు ఆశా, నిరంజన్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: వర్షాల నేపథ్యంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మూడు రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలు, మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో నగరంలో పరిస్థితిని కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కమిషనర్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు, నీవా నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించి నీటి ప్రవాహాలను పరిశీలించారు. కాలువల్లో నీటి ప్రవాహ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నీవానదిలోని పెద్ద కాలువల్లో నీటి ప్రవాహాలకు ఇబ్బందులు లేకుండా జేసీబీతో పూడిక, వ్యర్థాలు తొలగిస్తున్నారు. వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరుకు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యలపైనా సమీక్షించారు. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగుతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నగరపాలక పరిధిలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలన్నారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, ఏఈలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో పచ్చదనానికి ప్రాధాన్యత



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్

చిత్తూరు కలెక్టరేట్: చాలా సంవత్సరాల తర్వాత కలెక్టరేట్‌లో పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ప్రత్యేక చొరవతో కలెక్టరేట్‌లోని ప్రాంగణాలు, భవనాల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నారు. కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న ప్రదేశంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్ ఏర్పాటు చేస్తున్నారు. 2004 తర్వాత ప్రస్తుతం కలెక్టరేట్ భవనానికి పెయింటింగ్, మరమ్మతుల పనులు చేపడుతున్నారు.

యాదమరిలో ప్రారంభమైన ఫెన్సింగ్ పోటీలు



యాదమరి ఉన్నత పాఠశాలలో ఫెన్సింగ్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

యాదమరి(పూతలపట్టు): యాదమరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వసంతవాణి ప్రారంభించారు. అండర్16, 17 ఫెన్సింగ్ పోటీలకు జిల్లాలోని బాల, బాలికలు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20, 21, 22 నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయిపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పీడీలు కృష్ణయ్య, సిరాజ్ అహ్మద్, శరత్, నూర్ మొహ్మద్, ఉమాపతి, శాప్‌కోచ్‌లు రవి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంతో సావాసం

- జనావాసాల మధ్యే సెల్‌టవర్లు
- ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం
- కనుమరుగవుతున్న పక్షులు

గుడిపాల: సాంకేతిక విప్లవం రాకతో సెల్‌ఫోన్ లేని ఊరుని ఊహించలేం. అంతగా ప్రతి ఒక్కరి జీవనంలో భాగమైపోయింది ఈ పరికరం. సాంకేతిక వల్ల విప్లవాలే కాదు.. దుష్ప్రభావాలు ఉన్నాయి. ప్రజల అవసరాలను గుర్తించిన సెల్ కంపెనీలు మండల కేంద్రాలు, చిన్నపాటి పల్లెల్లోనూ టవర్లను ఏర్పాటు చేస్తున్నాయి. మెరుగైన సిగ్నల్స్ ఇస్తున్నామని చెప్పి రేడియేషన్ స్థాయిని పెంచి ప్రమాదకర వాతావరణాన్ని సృష్టించి మానవ మనుగడను మరింత జటిలం చేసేస్తున్నాయి.

మండలంలో పాపసముద్రం, గుడిపాల, చీలాపల్లె, 190రామాపురం, నరహరిపేట, పానాటూరు, బొమ్మసముద్రం, నంగమంగళం, 197రామాపురం, చిత్తపార ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల నడుమ సెల్‌టవర్లు ఏర్పాటు చేశారు. ఇందులో రేడియేషన్ స్థాయిల నియంత్రణలో ప్రైవేట్ ఆపరేటర్లు నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ టవర్‌ల నుంచి విడుదలవుతున్న రేడియేషన్‌తో జీవుల మనుగడకు తీవ్ర విఘాతం కలుగుతోంది. రేడియేషన్ వల్ల మానవుల్లో కణజాలం అభివృద్ధి తగ్గడం, డీఎన్ఏ ప్రభావితం అవుతుంది. మహిళల్లో గర్భస్రావాలు జరగడానికి ఆస్కారముంది. రేడియేషన్ కారణంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, నిద్రపట్టకపోవడం, డిప్రెషన్, వినికిడిలోపం, కంటిక్యాన్సర్, జ్ఞాపకశక్తి తగ్గడం, బ్రెయిన్ ట్యూమర్, గుండె జబ్బులు వంటివి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పశుపక్ష్యాదులపైనా..

రేడియేషన్ కారణంగా ప్రస్తుతం పక్షిజాతులు కనుమరుగవుతున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా పిచ్చుకలు, కాకులు, గుడ్లగూబలు గతంలో మాదిరిగా కనిపించడం లేదు. పశువుల్లో పాలఉత్పత్తి తగ్గిపోవడం, సంతానోత్పత్తి మందగించడం, వాటి ప్రవర్తనలో ఒక్కసారిగా మార్పులు జరుగుతుంటాయని నిపుణులు వివరిస్తున్నారు.



నరహరిపేటలో జనావాసాల మధ్య ఉన్న సెల్‌టవర్



రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యానికి గురైన పశువులు



మృతి చెందిన పిచ్చుక

పిల్లలు గర్భిణులు దూరంగా ఉండాలి

సెల్ టవర్లు, సెల్‌ఫోన్‌లకు చిన్నపిల్లలు, గర్భిణులు వీలైనంత దూరంగా ఉండాలి. వీరిపైనే ఈ రేడియేషన్ ప్రభావం ఎక్కువగా పడుతుంది. సెల్‌ఫోన్‌లో అవసరం మేరకే మాట్లాడాలి. తక్కువ సమయం మాత్రమే వినియోగించాలి. సెల్‌టవర్లకు దూరంగా నివాసాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ రష్మిత, బొమ్మసముద్రం

పశువులకు అనారోగ్యం

సెల్‌టవర్‌లకు దగ్గరగా సంచరించే పశువులు రేడియేషన్ ప్రభావానికి గురవుతున్నాయి. దీంతో వీటి ప్రవర్తనలో మార్పులు కనిపిస్తాయి. అనారోగ్యానికి గురవుతున్నాయి. పాల దిగుబడి తగ్గిపోవడం, మేత సరిగ్గా తినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

–రవితేజ, పశువైద్యాధికారి, బొమ్మసముద్రం

పిచ్చుకలు కనుమరుగు

వరిపంట కోసినా, కళ్లాల్లో ధాన్యంను ఆరబోసినా పిచ్చుకలు ఇబ్బడి ముబ్బడిగా వచ్చేవి. టవర్ల ఏర్పాటుతో వాటి జాడే కరువైంది. ఫలితంగా కీటక నాశనులైన పక్షులు లేక వరిచేలకు, ఇతర పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. టవర్లను జనావాసాలకు దూరంగా ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం అనుమతులు రద్దుచేసి దూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలి.

–జయరామ్, బొమ్మసముద్రం